క్లుప్తంగా

కరపత్రం విడుదల

అమరచింత: నియంతృత్వ, మతోన్మాద పార్టీలు బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం పార్టీలకు వ్యతిరేకంగా ఓటు వేసి ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని సీపీఐ (ఎంఎల్) ప్రజా పంథా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.సూర్యం అన్నారు. దీనికి సంబంధించి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో కరపత్రం, పోస్టర్లను ఆదివారం విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ హన్మంతు, రాజు, రాజన్న, సామేలు, కురుమన్న, భక్తరాజ్, జగదీష్, కిరణ్, సత్తన్న, మహిమూద్ పాల్గొన్నారు.

డీసీఎంను ఢీకొట్టిన బైకు

గోపాల్‌పేట: డీసీఎం వాహనాన్ని బైకు వెనక నుంచి ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయిన ఘటన మండల కేంద్రానికి సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాకు చెందిన డీసీఎం పెళ్లి కోసం మిర్యాలగూడకు గోపాల్‌పేట మీదుగా వెళ్తోంది. అదే సమయంలో బుద్దారం గ్రామానికి చెందిన మహేందర్ తన స్నేహితుడితో కలిసి వనపర్తి నుంచి బుద్దారం గ్రామానికి బైకుపై వెళ్తున్నాడు. పొలికెపాడు అడ్డ రోడ్డు వద్ద డీసీఎంను బైకు వెనక నుంచి ఢీకొట్టింది. దీంతో బైకుపై ఉన్న ఇద్దరు గాయాలపాలయ్యారు. చుట్టుపక్కల వారు గమనించి వారిని వనపర్తి అక్కడి నుంచి మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రిలో ప్రస్తుతం ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు తెలిసింది.

చాక్‌పీస్‌పై ప్రపంచ కప్



కల్వకుర్తి రూరల్: ప్రపంచకప్ క్రికెట్ పోటీలను దేశం ఆతిథ్యం ఇవ్వడానికి గుర్తుతో పాటుగా ప్రపంచకప్ ఫైనల్‌లో భారతదేశం చేరడానికి గుర్తుగా కల్వకుర్తి పట్టణానికి చెందిన యశ్వంత్ కుమార్(విద్యార్థి) 2 గంటలు కష్టపడి ప్రపంచ కప్ నమూనాను చాక్‌పీస్‌పై తీర్చిదిద్దాడు. యశ్వంత్‌ను పలువురు అభినందించారు.

ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు



మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలోని స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం హైదరాబాద్ నాంపల్లి ట్రాఫిక్ సీఐ ఎం.ఎస్ ఆనంద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి సీఐకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఏకశిలపై అనంతనయనస్వామి, లక్ష్మీదేవి, వరహ స్వామి, ఆంజనేయస్వామిలు ఆవిర్భవించడం పట్ల సీఐ విశిష్టత గల ప్రాంతంగా పేర్కొన్నారు. అనంతరం స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి మెమోంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు మధుసూదనాచారి, రవిచారి, చంద్రశేఖర్‌రావు, శ్రావణ్‌కుమార్‌గౌడు ఉన్నారు.

సేవాలాల్, జగదాంబ విగ్రహాల ప్రతిష్ఠ



కేటీదొడ్డి: మండలంలోని ఉమిత్యాలతండాలోని నూతన సేవాలాల్, జగదాంబ విగ్రహ పతిష్ఠ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం విగ్రహాన్ని ఉమిత్యాల బస్టాండ్ నుంచి తండా వరకు విగ్రహాన్ని భారీ ర్యాలీగా తీసుకెళ్లి ఆలయంలో పూజలు చేసి ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు చేపట్టాలి

మల్దకల్: మండలంలోని పెద్దపల్లి–కుర్వపల్లి గ్రామాల మధ్య ఉన్న ప్రధాన బీటీ రహదారిపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు, గద్వాల ఆర్టీసీ బస్సు రాకపోకలు సాగిస్తుంది. రాత్రి వేళలో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడిన ఘటనలు ఉన్నాయి. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు రాజశేఖర్‌రెడ్డి, రాజు, తిమ్మప్పలు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు రోడ్డు మరమ్మతులు చేయాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.

'కాంగ్రెస్‌కు ఓటేస్తే చీకటి రాజ్యమే'



చిట్యాలలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి



పర్వతాపురంలో..

వనపర్తి: కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే మరోసారి చీకటి రాజ్యం తప్పదని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం వనపర్తి మండలంలోని వెంకటాపూర్, అంకూర్, చిమనగుంటపల్లి, చిట్యాల, చిట్యాల తూర్పుతండా పంచాయతీల్లో నిర్వహించిన ప్రచారంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఎంతో కష్టపడి తీసుకొచ్చిన సాగునీటిని నిరంతరాయంగా పారించుకోవాలంటే మరోసారి బీఆర్‌ఎస్‌కు ఓటేసి గెలిపించాలని మంత్రి కోరారు. రైతులకు పెట్టుబడి ఖర్చు పెరుగుతున్న దృష్ట్యా రైతుబంధును రూ.16 వేలకు పెంచాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. గ్యాస్ సిలిండర్ ధర పెంచేది.. తగ్గించేది కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉంటుంది. కానీ ఎంత పెరిగిన ప్రజల మీద భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ భరించి రూ.400లకే సిలిండర్ ఇవ్వాలని నిర్ణయించామన్నారు. జిల్లాలో మెడికల్, ఇంజినీరింగ్, వ్యవసాయ, నర్సింగ్, పీజీ, మత్స్య కళాశాల తీసుకొచ్చి ఇక్కడి యువతకు ఉన్నత విద్యను అందించామన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

మంత్రి నిరంజన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్వీ విద్యార్థి విభాగం జిల్లా కోఆర్డినేటర్ ఉదయ్‌కిరణ్ ఆధ్వర్యంలో 30 మంది యువకులు చిమనగుంటపల్లిలో మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. మంత్రి వెంట జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, శిక్షణ తరగతుల జిల్లా అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, జిల్లా గిరిజన సంఘం అధ్యక్షులు జాత్యనాయక్, మండల అధ్యక్షుడు మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంతో పాటు పర్వతాపురం, సల్కెలాపురం తదితర గ్రామాల్లో సర్పంచులు, బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటికీ తిరిగి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీ చేపట్టిన రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, సాగునీరు, 24 గంటల ఉచిత విద్యుత్ తదితర పథకాలను వివరించారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తొమ్మిదిన్నరేళ్ల బీఆర్‌ఎస్ అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచు శ్రీనివాసులు, బాల్‌రాజు, మతీన్, శివ, సురేందర్, రవి, శేఖర్, సంజీవ్, నగేష్ పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగరాలలో బీఆర్‌ఎస్ మండల నాయకులు ఆదివారం ఇంటింటికీ తిరుగుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి మంత్రి నిరంజన్‌రెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ నిర్మల, రాధాకృష్ణ, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో ముమ్మరంగా చేరికలు



ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో యువకులు

భూత్పూర్: పట్టణానికి చెందిన మైనార్టీ, అమిస్తాపూర్, మండలంలోని కప్పెటకు చెందిన యువకులు ఆదివారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పట్టణంలోని మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్ నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో పట్టణానికి చెందిన మైనార్టీ యువకులు 30 మంది, అమిస్తాపూర్‌కు చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు వైఎస్ ఎంపీపీ నరేష్‌గౌడ్ ఆధ్వర్యంలో పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నారాయణగౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, మహ్మద్ సాధిక్, ఖదీర్, జహంగీర్, నయ్యీం, కప్పెట సర్పంచ్ వేణుగోపాల్, సత్యం, దామోదర్, గుంత రాజు, తిరుపతి తదితరులు ఉన్నారు.

అభివృద్ధి చూసి ఆశీర్వదించండి



ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

కొల్లాపూర్: కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు ముందు ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఆదిరాల అన్వేష్‌గౌడ్‌తో పాటు, కాంగ్రెస్ మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాలపీరు, మండలాల అధ్యక్షులు సయ్యద్, నిరంజన్, నజీర్, జాఫర్, పట్టణ అధ్యక్షుడు జహంగీర్‌తో పాటు పలువురు మైనార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డిని కలిసి బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి హర్షవర్ధన్‌రెడ్డి గులాబీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు.

కేసీఆర్ సభకు పోటెత్తిన జనం

కొల్లాపూర్ రూరల్/ పెంట్లవెల్లి: కొల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని ఏడు మండలాల్లోని ప్రతి గ్రామం నుంచి బీఆర్‌ఎస్ కార్యకర్తలు, మహిళలు, కొల్లాపూర్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు తండోపతండాలుగా తరలివచ్చారు.

పెద్దకొత్తపల్లి: మండలంలోని సాతాపూర్, నక్కలపల్లి, ఆదిరాల, వెన్నచర్ల, కల్వకోలు, చెన్నపురావుపల్లి, పెద్దకొత్తపల్లి గ్రామాల నుంచి కొల్లాపూర్, ప్రజా ఆశీర్వాద సభకు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పాన్‌గల్: కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం కేసీఆర్ ఆశీర్వాద సభకు మండలం నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మి, వెంకటయ్య నాయుడు, వైస్ ఎంపీపీ కవితతో పాటు పార్టీ సర్పంచ్‌లు తరలివెళ్లారు.

చిన్నంబావి: కొల్లాపూర్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ప్రజా ఆశీర్వాద సభకు మండలంలోని పలు గ్రామాల్లో బయలుదేరి వెళ్లారు. సీఎం కేసీఆర్ హాజరు అవుతుండటంతో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో కొల్లాపూర్‌కు ర్యాలీగా వెళ్లారు. సోమేశ్వరమ్మ, వెంకటరమణమ్మ, గోవింద్ శ్రీధర్‌రెడ్డి, మద్దిలేటి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ప్రచారం

■ వనపర్తి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి మేఘారెడ్డిని గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకురాలు అరుణజ్యోతి, ఖిల్లాఘనపురం మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు కోరారు. ఈ సందర్భంగా వారు ఆయా మండలాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో క్యామ రాజు, బాల్‌రాజు, డాక్టర్ నరేందర్‌గౌడ్, లింగస్వామి, గోవిందు నాయక్, మోష, చంద్రయ్య, వంశీ, రమేష్, ఎర్ర కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

■ ప్రజలకు మేలు జరగాలంటే అవినీతికి చోటివ్వని బీజేపీ పార్టీని ఆదరించి తనని గెలిపించాలని ఎమ్మెల్యే అభ్యర్థి అనుజ్ఞారెడ్డి కోరారు. ఆదివారం ఆయన పెబ్బేరు పట్టణ కేంద్రంలో స్థానిక నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, గొని వేమారెడ్డి, వెంకట్రామారెడ్డి, కంచె ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

■ ఈనెల 23న మక్తల్‌లో జరిగే మంత్రి కేటీఆర్ రోడ్‌షోలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఆంజనేయులు గౌడ్ కోరారు. అమరచింత పట్టణంలో బీఆర్‌ఎస్ బూత్ కమిటీ నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డి గెలుపు కోసం సైనికులుగా పనిచేయాలన్నారు.

బీజేపీతో సంక్షేమం



చిన్నంబావి: నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎల్లేని సుధాకర్‌రావును గెలిపించాలని మండలంలోని పెద్దదగడలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ నాయకులు కిరణ్‌కుమార్ మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధి కావాలంటే బీజేపీతోనే సాధ్యం అవుతుందని అన్నారు. గత ఎన్నికల్లో ఓడిపోయిన నాటినుంచి సుధాకర్‌రావు ప్రజాసేవ చేస్తూ ఐదేళ్లుగా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని అన్నారు. ఆయన గెలుపు యువత భవిష్యత్‌కు అవసరమన్నారు. కరుణాకర్, ఉపేందర్, కురుమయ్య, వెంకటయ్య, శరత్ తదితరులు పాల్గొన్నారు.

నేలవాలుతున్న వరి పంట



గోపాల్‌పేట, ఏదుట్ల శివారులో ఒరిగిన వరిపంట

- కోత సమయంలో ఇబ్బందులు
- నేలరాలుతున్న వడ్లు
- యూరియాతోనే ముప్పు అంటున్న వ్యవసాయ అధికారులు

గోపాల్‌పేట: వానాకాలం సీజన్‌లో వేసిన వరి పంట నేలకు ఒరగడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. దిగుబడి పెరిగి లాభాలు ఎక్కువగా వస్తాయన్న ఉద్దేశంతో రైతులు యూరియా అధిక మోతాదులో వాడుతుండడంతోనే ఈ సమస్య ఉత్పన్నం అవుతుందని వ్యవసాయ అధికారులు తెలిపారు. దీంతో పంట దిగుబడి దేవుడెరుగు కానీ ఎక్కువ మొత్తంలో పంట నష్టం వాటిల్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో ఈ వానాకాలం సీజన్‌లో 12వేల ఎకరాలు సాగుచేయగా.. రేవల్లి మండలంలో 9వేల ఎకరాల్లో వరి సాగుచేశారు. ప్రస్తుతం వరిపంటలు కోతదశకు చేరుకున్నాయి.

కొంప ముంచుతున్న యూరియా

రైతులు ఎకరాకు వంద కిలోల వరకు యూరియా వాడితే పంటకు బాగుంటుంది. కానీ చేలు ఏపుగా పెరగాలని రెండు క్వింటాళ్ల వరకు వాడుతున్నారని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పంట ఏపుగా పెరిగి చిన్నపాటి గాలులకు సైతం వరి కర్రు నేలకు వాలుతుంది. దీంతో పంట ఎండిన తర్వాత గింజలు రాలిపోవడంతో పాటు వరి కోసేందుకు యంత్రాలు ఎక్కువ సమయం తీసుకుంటుండడంతో రైతులకు ఖర్చులు తడిసి మోపెడుఅవుతున్నాయి. అలాగే బీపీటీలో పంట కోతదశకు చేరే సమయంలో సుడిదోమ, ఇతర తెగుళ్ల సోకి దిగుబడి తగ్గుతుంది. రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలని కోరుతున్నారు.

చిన్నపాటి గాలులకే..



వరి పంటలు చిన్నపాటి గాలులకే నేలకొరుగుతున్నాయి. తెగుళ్ల రాకుండా పంట దిగుబడి పెరిగేందుకు యూరియా వాడుతున్నారు. మేము మూడెకరాల్లో వరి సాగు చేశాం. కోత సమయంలో కొంత చేను ఒరిగిపోయింది. రైతులకు వ్యవసాయ అధికారులు ముందుగా అవగాహన కల్పించి పంటలకు ఏ ఎరువులు వాడాలి దిగుబడి ఎలా పెంచుకోవాలో అవగాహన కల్పిస్తే బాగుంటుంది.

– బోడ్డోళ్ల మణ్యం, రైతు, గోపాల్‌పేట

సూచనలు తీసుకోవాలి

రైతులు పంట దిగుబడి పెరుగుతుందన్న ఉద్దేశంతో యూరియా ఎక్కువగా వాడుతున్నారు. దీంతో వరిచేలు ఎక్కువ ఎత్తుకు పెరగడం, కాండం వద్ద సన్నగా ఉంటుంది. అలా కాకుండా రైతులు ఒక ఎకరానికి కేవలం వంద కిలోల యూరియా వాడితే చాలు. రైతులు యాసంగి సాగులో అయినా వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలి.

– అనిల్‌కుమార్, వ్యవసాయ అధికారి, గోపాల్‌పేట

పేదల సంక్షేమమే ఎజెండా



మందిపల్లిలో మాట్లాడుతున్న వాకిటి శ్రీహరి

మక్తల్: రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం వస్తుందని, పేదలకు సంక్షేమ ఫలాలు అందిస్తామని మక్తల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం మాగనూర్ మండలంలోని మందిపల్లి, గజ్జరన్‌దొడ్డి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌పై ప్రజలకు అభిమానం ఉందని, ఎన్నికల్లో ఓట్ల రూపంలో చూపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ పేదల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌లో చేరుతున్న వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మక్తల్ పట్టణంలో వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, బాలక్రిష్ణారెడ్డి, గడ్డంపల్లి హన్మంతు, ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, సిదార్థరెడ్డి, చంద్రకాంత్‌గౌడ్, రవికుమార్‌యాదవ్, అంజనేయయులుగౌడ్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: సంక్షేమ పథకాలను ప్రజలందరికీ అందించి దేశ వ్యాప్తంగా పేదరికం నిర్మూలనకు కృషి చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్ అన్నారు. వాకిటి శ్రీహరికి మద్దతుగా ఆదివారం పట్టణంలోని మూడో, నాల్గో వార్డులో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, తౌఫిక్, అన్సు, జుబేర్ అహ్మద్, ప్రకాష్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని ముడుమాల్, మురహర్‌దొడ్డి, టైరోడ్డు, వాసునగర్ గ్రామాల్లో ఆదివారం కాంగ్రెస్ అభ్యర్థి వాకటి శ్రీహరి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో క్రిష్ణమూర్తి, నారాయణ, ముడుమాల్ భీమశంకర్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసేందుకు అవకాశం ఇవ్వండి



మక్తల్ రోడ్‌షోలో మాట్లాడుతున్న డీకే అరుణ



నాగిరెడ్డిపల్లిలో ప్రచారం చేస్తున్న మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి

మక్తల్: అసెంబ్లీ ఎన్నికల్లో మక్తల్‌లో బీజేపీ విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం నర్వ మండలంలోని నాగిరెడ్డిపల్లిలో జలంధర్‌రెడ్డి, మక్తల్ పట్టణంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య, జలంధర్‌రెడ్డి సతీమణి పద్మజారెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. మక్తల్‌లో బీజేపీ జెండా ఎగురవేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని సూచించారు. ఒక్కసారి అవకాశం ఇస్తే అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపిస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పావని, వైస్ చైర్‌పర్సన్ అఖిలారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కరిన్న్వామి, ఈసరి నాగప్ప, కౌన్సిలర్లు కౌసల్య, అర్చన, ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, రంగప్ప, తిమ్మప్ప, రాజశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్, నాగప్ప, కుర్వ లింగం, ద్యావరింటి నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలి

రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అవినీతి పాలన కొనసాగుతుందని, ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పి ఇంటికి సాగనంపాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. ఆదివారం మక్తల్‌లో జలంధర్‌రెడ్డికి మద్దతుగా నల్లజానమ్మ ఆలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు రోడ్ షో నిర్వహించారు.

అమరచింత: నియోజకవర్గ అభివృద్ధి కోసం బీజేపీకి ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే అభ్యర్థి జలేంధర్‌రెడ్డి సతీమణి పద్మజారెడ్డి కోరారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో బీజేపీ మహిళా మోర్చా నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే ప్రభుత్వం ఉంటే అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, సుజాత, అంజలమ్మ, క్యామ భాస్కర్, మేర్వరాజు, అశోక్, నారాయణ, వెంకటేశ్వర్లు, దుబాయ్ వెంకటేశ్వర్‌రెడ్డి, నరాల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మరికల్: మండలంలోని జిన్నారం, చిత్తనూర్, ఎక్లాస్‌పూర్ తదితర గ్రామాల్లో జలంధర్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ అధికారంలోకి వస్తే ప్రజా సంక్షేమ పాలన అదిస్తామన్నారు. కార్యక్రమంలో రమేష్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు వెలకట్టలేనివి



పెద్దమందడిలో ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వనపర్తిటౌన్: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేసి, ప్రజా నాయకురాలిగా పేరొందిన దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ సేవలు మరువలేనివని టీపీసీసీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్, మాజీ మంత్రి డా. చిన్నారెడ్డి కొనియాడారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో ఇందిరాగాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇందిరమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రపంచ మహిళా లోకానికి ఇందిరాగాంధీ స్ఫూర్తిగా నిలిచారని, దేశంలోనే మొట్టమొదటిసారి గరీబీ హటావో అని నినదించిన మహనీయురాలని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, పార్టీ జిల్లా, పట్టణ నాయకులు, పార్టీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా బస్టాండు సమీపంలో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహం ఎదుట ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గణేష్‌గౌడ్, శివన్న, వెంకటేష్, నాగేషి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం, పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి జెడ్పీటీసీ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యావ్, ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి, రాములుయాదవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎండీ హుస్సేన్, సురేందర్‌గౌడ్, యుగంధర్‌రెడ్డి, రామన్‌గౌడ్, దయాకర్‌రెడ్డి, జాంగీర్, పాతపల్లి చంద్రశేఖర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో దివంగత ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటన్న, అడ్వకేట్ త్రినాథ్, గట్టు మన్నెం, వాకిటి శ్రీనివాసులు, గట్టు దయాకర్, వాకిటి నరేష్, జాహిద్, ప్రవీణ్ కుమార్, అతిక్ పాల్గొన్నారు.

మైసమ్మ జాతరకు తగ్గిన భక్తులు

పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు ఈ ఆదివారం భక్తులు తక్కువ సంఖ్యలో హాజరై మైసమ్మ దేవతను దర్శించుకున్నారు. వివాహాలు, సీఎం కేసీఆర్ సభ కొల్లాపూర్‌లో ఉండటంతో చాలా మంది కొల్లాపూర్‌కు, వివాహాలకు తరలివెల్లడంతో 3 వేల మంది మాత్రమే భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో పాటు గ్రామాల్లో ప్రచారాల పర్వం ముమ్మరంగా కొనసాగుతున్నాయి